## క్లుప్తంగా

### ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 22వరకు గడువు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్ల గడువు ఈనెల 22 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి బుధవారం తెలిపారు. 7– 10వ తరగతిలోని ఖాళీ సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

### పనులు నాణ్యతతో చేపట్టాలి


పాఠశాలను పరిశీలిస్తున్న మందడి సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో రూ.26లక్షలతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఊట్కూరి వెంకట్‌రెడ్డి, బొజ్జ శంకర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

### నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : గుర్రంపోడు మండలం మైలాపురం గ్రామానికి చెందిన బాలికను సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మృతురాలి కుటుంబానికి పోక్సో చట్టం ప్రకారం ఆర్థిక సహకారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాలడుగు నాగార్జున, యాదయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

### గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నార్కట్‌పల్లి : మూగ జీవాలకు వచ్చే గర్భకోశ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని గ్రామంలో నిర్వహించిన గర్భకోశ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపసర్పంచ్ బురి యాదయ్య, వార్డు సభ్యులు పంగ రమేష్, పాల సంఘం చైర్మన్ అలుగుబెల్లి అనంతరెడ్డి, రాజిరెడ్డి, డాక్టర్ యాదయ్య, రవి, జ్యోతి, సుజాత, అనిత, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### డబుల్ బెడ్ రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

చిట్యాల: డబుల్ బెడ్ రూం ఇళ్లకు మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లు లేని అర్హులైన పేదలు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### నిధుల మంజూరు పత్రాల అందజేత

చిట్యాల: పట్టణంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో మంజూరు చేసిన రూ.5లక్షల నిధుల మంజూరు పత్రాలను బుధవారం గౌడ సంఘం ప్రతినిధులకు మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్ కోనేటి క్రిష్ణ, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోన్నం లక్ష్మయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి జిట్ట చంద్రకాంత్, యువజన విభాగం మండల అధ్యక్షుడు చిత్రగంటి ప్రవీణ్ పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కేతేపల్లి : కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు పులుసు శంకర్ తన రెండు కాడెద్లను మేపేందుకు గ్రామ శివారులో నకిరేకల్ పట్టణానికి వెళ్లే రోడ్డు వెంట ఉన్న వ్యవసాయ పొలాల వద్దకు తోలుకెళ్లాడు. ఈక్రమంలో సమీపంలో కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు ఎద్దుకు తగలంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

### ప్రేమ్‌కుమార్‌కు నివాళి

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ శివారులో మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బయ్యా ప్రేమ్‌కుమార్ మృతిచెందాడు. మృతదేహాన్ని బుధవారం టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దైద రవీందర్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంలు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట జటంగి వెంకటనర్సయ్యయాదవ్, ఉపేందర్‌రెడ్డి, కుమ్మరి నాగయ్య ఉన్నారు.

# ఆంగ్ల భాషా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో రాణించిన మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్టెల్లా
- అభినందించిన ఉపాధ్యాయులు, మండల ప్రజలు


విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న హన్మకొండ డీఈఓ అబ్దుల్

మర్రిగూడ : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కూడా రాణించగలరని నిరూపించింది మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గంటెల విక్టోరియా స్టెల్లా. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో ఆంగ్ల భాషా పట్టుపై విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీవీ స్టెల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

**విద్యార్థిని కుటుంబ నేపథ్యం**

గంటెల దానియెల్ జోసెఫ్, ఆశారాణిలకు గంటెల విక్టోరియా స్టెల్లా, ఆశా షారుఖ్‌లు కుమార్తెలు. స్టెల్లా పెద్ద కుమార్తె. తండ్రి బస్సు డ్రైవర్, తల్లి టైలరింగ్ చేస్తుంటుంది. వీరిది మొదటగా నాంపల్లి మండలం అయినప్పటికీ హైదరాబాద్‌లో ఉండేవారు. కుమార్తెలిద్దరూ హైదరాబాద్‌లోని బాలాపూర్ ఎస్ఆర్‌డీజీలో చదివారు. కరోనా వీరి కుటుంబాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేయడంతో 2020లో చింతపల్లి మండలంలో ఉన్నారు. అనంతరం 2021 నుంచి మర్రిగూడలో ఉంటున్నారు. గతేడాది మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు పొందారు. జీవనోపాధి, మనోధైర్యం కోసం సమీప బంధువుల వద్ద ఉంటున్నామని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నామని తండ్రి పేర్కొన్నారు.

**పోటీల నిర్వహణ..**

ఆంగ్ల భాషపై పోటీలను డిసెంబర్ 29న పాఠశాల స్థాయి, జనవరి 7న మండల స్థాయి, జనవరి 22న జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఫిబ్రవరి 13న రాష్ట్ర స్థాయి పోటీలను వరంగల్‌లోని ఎన్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో నిర్వహించారు. ఈపోటీల్లో ప్రథమ స్థానం పొందిన స్టెల్లాకు హన్మకొండ డీఈఓ అబ్దుల్‌హై ప్రశంసపత్రం అందజేశారు. 33 జిల్లాల నుంచి జిల్లాకు నలుగురు చొప్పున 132 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 1300 ఆంగ్ల భాషా పదాలను చెప్పగలిగేంత ప్రతిభను కనబరచాల్సి ఉంటుంది. స్టెల్లా రాష్ట్ర స్థాయిలో రాణించడంతో విద్యార్థినితోపాటు, విద్యార్థినిని తీర్చిదిద్దడంలో కృషి చేసిన ఉపాధ్యాయురాలు మంజుశ్రీని మండల ప్రజలు అభినందిస్తున్నారు.

**గర్వకారణంగా ఉంది**



మా పాఠశాల విద్యార్థిని జీవీ స్టెల్లా రాష్ట్ర స్థాయి ఆంగ్ల భాషా పోటీల్లో ప్రథమ స్థానం నిలవడం మాకు గర్వకారణంగా ఉంది. విద్యార్థిని మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చొరవ చూపుతాం. స్టెల్లాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి. మండల కీర్తి ప్రతిష్టలను పతాక స్థాయికి తీసుకెళ్లిన స్టెల్లాను, కృషి చేసిన ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్నా.

– భిక్షమయ్య, మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

**ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..**



మా పాఠశాల ఉపాధ్యాయులు విద్యావిలువలు తెలియజేస్తూ ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతోనే ఈ పోటీల్లో రాణించగలిగా. ఏ పోటీల్లో అయినా రాణించగలననే నమ్మకం కలిగించారు. అందుకు నేను నా వంతుగా కృషిచేశాను. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి కూడా రాణించవచ్చనే నమ్మకాన్ని ఉపాధ్యాయులు కల్పించారు.

– గంటెల విక్టోరియా స్టెల్లా, విద్యార్థిని

# డిజిటల్ లావాదేవీలు సులభతరం


ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

నల్లగొండ టౌన్ : డిజిటల్ లావాదేవీలు సులభతరమని, వాటి నిర్వహణలో జాగరూకత పాటించాలని నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆర్థిక లక్షరాస్యతపై బ్యాంకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు సూచనల మేరకు నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 17 వరకు ఆర్థిక లక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీపీఎం ప్రశాంతకుమార్ బారియర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఎస్‌బీఐ ఆర్ఎం. విజయ్‌కుమార్, నాబార్డ్ డీడీఓ వినయ్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి మక్బుల్‌అహ్మద్ వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉంటా


ఆర్థికసాయం అందజేస్తున్న రామరాజు యాదవ్

నల్లగొండ రూరల్ : పేదలకు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ ద్వారా అండగా ఉంటామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. బుధవారం కనగల్ మండలం లచ్చుగూడెం గ్రామ పరిధిలోని తిమ్మాజిగూడేనికి చెందిన పెరిక ముత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహానికి ఆయన నివాళులర్పించి, బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వెంకటేశం, మారయ్య, శ్రీను, సైదులు, క్రాంతి ఉన్నారు.

## ఎల్‌ఓసీ పత్రాల అందజేత

చిట్యాల: పట్టణంలోని పదో వార్డుకు చెందిన మంచాల ఎల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడికి చికిత్స నిమిత్తం మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని బుధవారం నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. శిలివేరు శేఖర్, గ్రంథాలయ చైర్మన్ దాసరి నర్సింహ, శివ ప్రసాద్, మంచాల గణేష్ పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

# ఆలయాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నల్లగొండ టూటౌన్ : మహాశివరాత్రి సందర్భంగా దేవాలయాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం పానగల్‌లోని ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. 18న మహాశివరాత్రి ఉన్నందున పానగల్ సెంటర్ నుంచి ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల వరకు, పానగల్ కట్టపై లైట్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. పానగల్ సెంటర్ నుంచి ఆలయాల వరకు ఉన్న నాలుగు పార్కింగ్ స్థలాలను శుభ్రపరచాలని, ఆర్చి నుంచి ఆలయాల వరకు మొక్కలు నాటాలన్నారు. కోనేరును శుభ్రపరిచి నీటిని పూర్తిస్థాయిలో నింపాలని తెలిపారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో చెత్త బుట్టలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఛాయా సోమేశ్వరాలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, డీఈలు వెంకన్న, నర్సింహారెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, ఎసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజా అలి, సురిగి శంకర్ తదితరులు ఉన్నారు.

# రజకుల అభివృద్ధికి కేసీఆర్ పెద్దపీట


దోబీఘాట్ వద్ద వాషింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు


తిప్పర్తిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రజకుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ 28వ వార్డులో రూ.57లక్షలతో నిర్మించిన ఆధునిక దోబీఘాట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెంగుళూరు తరహాలో 100 శాతం సబ్సిడీతో దోబీఘాట్లను నిర్మించడంతోపాటు లక్ష మందికి పైగా నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం చారిత్రాత్మకమైన విషయమన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నల్లగొండ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, కమిషనర్ రమణాచారి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్, కయ్యూంబేగ్, ఊట్కూరి వెంకట్‌రెడ్డి, కొమ్ము నాగలక్ష్మి, పూజిత శ్రీను, మాతంగి సత్యనారాయణ, శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ జమాల్‌ఖాద్రీ, రజక సంఘాలు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**ప్రతిపక్షాలవి అసత్య ఆరోపణలు**

రామగిరి(నల్లగొండ) : నియోజకవర్గంలో తిప్పర్తి మండలంలోనే అత్యధిక నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రతిపక్షాలు కావాలనే అసత్య ఆరోపణలు చేస్తున్నాయని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు, రూ.45 లక్షల ఎస్ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మర్రిగూడ ఎక్స్‌రోడ్డు నుంచి జంగారెడ్డిగూడెం వరకు రూ.1.90 లక్షల నిధులతో బీటీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. మర్రిగూడలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, ఎంపీపీ విజయలక్ష్మీ, రొట్టెల రమేష్, వనపర్తి నాగేశ్వరరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజాపోరాటాలు నిర్వహిస్తాం


మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. నియోజకవర్గంలోని స్థానిక సమస్యలపై ప్రజలతో మమేకమై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పాలడుగు నాగార్జున, సయ్యద్‌హాషం, పాలడుగు ప్రభావతి, దండెంపల్లి సత్తయ్య, నన్నూరి వెంకటరమణారెడ్డి, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, మన్నె భిక్షం, కందుల సైదులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌రావు

నార్కట్‌పల్లి : ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యుత్ బకాయిలు ఉన్న వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తున్న ఉద్యోగులపై దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని నార్కట్‌పల్లి మండల విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. బుధవారం స్థానిక చాంబర్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ సర్వీస్ వైర్లు కట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 7న ఎనిమిదోరి గ్రామంలో విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులపై వినియోగదారులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వారిపై కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

# ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషిచేయాలి


నల్లగొండలో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నెల్లికంటి సత్యం


చిట్యాలలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేస్తున్న బొడిగె సైదులుగౌడ్ తదితరులు

నల్లగొండ టౌన్ : మాజీ ఎంపీ ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ధర్మభిక్షం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవన్‌కుమార్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి, కార్యదర్శి బొడిగె సైదులు, జిల్లా యాదయ్య, మొగుళ్ల సైదులు, ముండ్ల ముత్యాలు, పాండరి, మదార్, యూసుఫ్, రామకోటిలి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మాజీ ఎంపీ ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు గౌడ్ కోరారు. బుధవారం చిట్యాలలో సీపీఐ, గీత పనివారల సంఘం ఆధర్యంలో ధర్మభిక్షం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, దేశగాని బాలరాజు, పల్లె శంకరయ్య, బుస్సు అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

మర్రిగూడ : మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం గీత పనివారల సంఘం నాయకులు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి జంగయ్యగౌడ్, యాదయ్య, రఘుమయ్య, కృపాచారి, రామలింగాచారి పాల్గొన్నారు.

చండూరు : మాజీ ఎంపీ ధర్మభిక్షం జయంతిని చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, మండల కార్యవర్గ సభ్యుడు కర్నాటి వెంకటేశం, గీత పనివారల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గంట రమేష్, గంట నగేష్, సీపీఐ బంగారుగడ్డ శాఖ కార్యదర్శి పల్లె నరసింహ, పల్లె రాజు పాల్గొన్నారు.

# అనాథ చిన్నారికి ఎంపీ కోమటిరెడ్డి ఆర్థిక చేయూత


అడ్లూరులో చిన్నారి కుటుంబసభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందజేస్తున్న నాయకులు

శాలిగౌరారం: తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన చిన్నారి కదారి భువనశ్రీకి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక చేయూతనందించారు. బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో చిన్నారి పేరున రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత డిపాజిట్ పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిన్నారి తాత, నానమ్మలకు అందజేశారు. కార్యక్రమంలో ఆకారం, వల్లాల సర్పంచ్‌లు కందాల సమరంరెడ్డి, షేక్ ఇంతియాజ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండపల్లి కొమరయ్య, భూపతి అంజయ్య, గుత్తా రవీందర్‌రెడ్డి, నిమ్మల కృష్ణయ్య, గరికంటి శంకర్, బండారు హన్మంతు, కదారి నాగయ్య, మాచర్ల కాంతయ్య, మల్లయ్య, సతీష్, గోదల వెంకట్‌రెడ్డి, జవాజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


సరంపేట పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

మర్రిగూడ : మండల పరిధిలోని సరంపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వాణి కుమారి, విజయలక్ష్మి, భాగ్యరాణి, నర్గిస్ సుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక

శాలిగౌరారం : గ్రామపంచాయతీ కార్యదర్శుల మండల నూతన కార్యవర్గాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా సీహెచ్.అశోక్, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహాచారి, ఉపాధ్యక్షులుగా జె.రేణుక, ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరేందర్, కోశాధికారి సయ్యద్ జాన్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## పాఠశాలకు టీవీ బహూకరణ

శాలిగౌరారం : మండలంలోని చిత్తలూరు గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1992 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు బుధవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని శ్రీ పార్వతీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు స్థానికంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18న శ్రీ పార్వతీ కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం, 19న అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, 20న అగ్నిగుండాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు పక్కీరు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏనుగు నరేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌నేత, కార్యదర్శులు పోలోజు శ్రీనివాసచారి, ఇరిగి శివ పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఉమామహేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

- 21 వరకు కొనసాగనున్న ఉత్సవాలు


భైరవునిబండలోని ఉమామహేశ్వర దేవాలయం

శాలిగౌరారం : మండలంలోని భైరవునిబండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన గంగాభవానిసమేత శ్రీ ఉమామహేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి 21 వరకు ఉత్సవాలు జరగనుండడంతో భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**21న ముగియనున్న బ్రహ్మోత్సవాలు**

శ్రీఉమామహేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 17న(శుక్రవారం) ప్రారంభమై ఈనెల 21న (మంగళవారం) ముగియనున్నాయి. శుక్రవారం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, మండపారాధనలు, రాత్రి శ్రీఉమామహేశ్వర దేవతామూర్తులు కొండ(గుట్ట) పైకి ఆగమించడం, 18న(శనివారం) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అగ్నిప్రతిష్ఠ, పీఠదేవతావాహనాల మంత్ర హోమాలు, రుద్రహోమం, సాయంత్రం ప్రదోషకాలపూజలు, రాత్రి 12 గంటలకు శ్రీ ఉమామహేశ్వర దేవాతామూర్తుల కల్యాణం, తెల్లవారుఝామున స్వామివారి తలంబ్రాలు, 19న (ఆదివారం) రుద్రహోమం, చండీహోమం, లలితసహస్రనామపారాయణం, సాయంత్రం మంగళహారతి, మంత్రపుష్పం, 20న(సోమవారం) నిత్యపూజలు, రుద్రాభిషేకాలు, హోమాధికములు, విష్ణుసహస్రనామస్తోత్రపారాయణం, అర్చనలు, మంగళహారతి, మంత్రపుష్పం, ఉదయం 10 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం, సాయంత్రం 4 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ బోనాలు, తెల్లఝామున అగ్నిగుండాలు, 21న(మంగళవారం) నిత్యపూజలు, రుద్రాభిషేకాలు, హోమం, మధ్యాహ్నం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు గిరిప్రదక్షిణలు, సాయంత్రం బలిహరణ నిర్వహించనున్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు ఆలయం ముస్తాబు


చెర్కుపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం

కేతేపల్లి : కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శంభులింగేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠతోపాటు రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి 18వ తేదీ వరకు గ్రామ పురోహితులు పగిడిమర్రి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. గురువారం గణపతి పూజ, దీక్షధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అగ్ని మదనం, విగ్రహాల ఊరేగింపు, తీర్థ ప్రసాద వితరణ, 17న పుణ్యాహవచనం, మండప పూజలు, క్షీరాధివాసం, జలాధివాసం, అవాహిత దేవతాహోమాలు, కుంకుమార్చన, 18న గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, కుంభ వాహనం, వేదాశీర్వచనం, రాత్రి 12 గంటలకు భక్తులకు ప్రత్యేక దర్శనం, 12.30 గంటలకు శ్రీ శంభులింగేశ్వరస్వామి కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.